# తరుణి

-పెరుమాండ్ల శ్రీదేవి

"సీతా... ఓ... సీతా" సురేష్ పిలుపు. అది పిలుపు కాదు అరుపు.

"ఏంటండీ" వంటింట్లోంచే అంది సీత.

"నేను లేచి ఎంత సేపయింది. నా పేపర్ చదవడం కూడా అయిపోయింది. నా మొహాన ఇంత టీ పడేసేదుందా, లేదా" భర్తగారి విసుగు.

"వస్తున్నానండీ, పాలు వచ్చింది ఇప్పుడేగా" హడావుడిగా టీ పెడుతూ అంది.

"అమ్మా నా సైన్స్ నోట్స్ కనపడడం లేదు" నానిగాడి కేక.

"అక్కడే వుంటుంది చూసుకోరా" చెప్పింది కూరలోకి ఉల్లిపాయలు తరుగుతూ.

"లేదు అమ్మా, నీవే కాస్త వెతికి పెట్టు"

"హోమ్ వర్క్ చేసుకోగానే నీ బ్యాగ్‌లో పెట్టేసుకొమ్మని చెప్పానా, లేదా" అంటూ నాని బ్యాగ్‌లో వెతికింది. తీరా చూస్తే నోట్స్ వాడి బ్యాగ్‌లోనే ఉంది. నోట్స్ వాడికి ఇచ్చి గబగబా కిచెన్‌లోకి వచ్చేసరికి తను పెట్టిన టీ కాస్తా పొంగిపోయింది. ఉస్సూరు మంది సీతకి.

మళ్ళీ టీ పెట్టి, మరో స్టౌ మీద కూర పోపుకు వేసింది.

"అమ్మాయి సీతా మీ మామయ్యకి రాత్రి నుంచి గొంతు పట్టేసినట్టు ఉంది. కాస్త మిరియాల చాయ్ చెయ్యమ్మా" అత్తగారి ఆజ్ఞ.

అలాగే అత్తయ్యా అని భర్తకి టీ ఇచ్చి మళ్ళీ మామగారికి టీ పెట్టింది.

"అమ్మా, అన్నయ్య నా పెన్ను లాక్కున్నాడే" అన్నయ్యపై కూతురి ఫిర్యాదు.

"అబ్బబ్బబ్బా ఏంటీ మీ గొడవ కాసేపు కూడా కుదురుగా ఉండలేరు. వెళ్ళు ఇక్కడి నుంచి" విసుక్కుంది కూతుర్ని.

"ఏమోయ్ స్నానానికి నీళ్ళు తోడావా" భర్త కేక.

"ఆ... ఆ... తోడుతున్నాను" కంగారుగా అంది సీత.

ఎలాగయితేనేం భర్తగారి విసుర్ల మధ్య, అత్తగారి ఆజ్ఞల మధ్య, పిల్లల పేచీల మధ్య ఎలాగోలా ఇంటి పనంతా ముగించుకుని తొమ్మిది గంటల వరకు బస్టాండ్‌కు చేరుకుంది.

సీతది ప్రభుత్వోద్యోగం. సురేష్‌ది కూడా ప్రభుత్వోద్యోగమే. జీతం ఇద్దరికీ దాదాపు సమానంగానే వస్తుంది. సమానత్వం లేనిదల్లా బాధ్యతల విషయంలోనే.

సీత ఆరుగంటలకు లేచి తొమ్మిది గంటల దాకా ఇంటి పనిలో సతమతమవుతుంటే సురేష్ మాత్రం ఏడున్నరకి లేచి తాపీగా భార్య ఇచ్చిన టీ తాగుతూ ఎనిమిది గంటల దాకా తీరిగ్గా పేపర్ చదువుతాడు. ఆ తరువాత స్నానం చేసి,భార్య పెట్టిన టిఫిన్ తిని లంచ్ బాక్స్ స్కూటర్ డిక్కీలో పెట్టుకుని, స్కూటర్ స్టార్ట్ చేసుకుని వెళ్ళిపోతాడు.

కనీసం భార్యను బస్టాండ్‌లో డ్రాప్ చెయ్యాలనే ఆలోచన కూడా అతనికి రాదు. ఒకవేళ ఎప్పుడయినా వచ్చినా "మనకెందుకులెద్దూ, రోడ్డు మీద అమ్మాయిల అందాలని స్వేచ్ఛగా చూడకుండా వెనకొక మేళం" అనుకుని ఆ ఆలోచన తీసేసేవాడు.

సీత మాత్రం భర్త వెళ్ళిపోయాక పిల్లల్ని స్కూల్ వ్యాన్‌లో ఎక్కించి తను మాత్రం నడుచుకుంటూ బస్టాండ్ చేరుకుంటుంది.

ఆఫీసులో సురేష్, సీత చేసే పని సమానమే అయినా సాయంకాలం ఇంటికొస్తే అంతా అసమానత్వమే మళ్ళీ.

సురేష్ ఆఫీసు నుంచి రావడంతోనే కాళ్ళు బార్ల చాపుకుని అలసట తీర్చుకుంటాడు. సీత మాత్రం ఆఫీసు నుంచి రావడంతోనే కిచెన్‌లోకి వెళ్ళి టీ స్టౌ మీద పెడుతుంది. ఆ తరువాత కాళ్ళు, చేతులు మొహం కడుక్కుని టీ "అలసిపోయిన" భర్తకీ, అత్తమామలకీ ఇచ్చి తను త్రాగుతుంది.

ఇంతలోనే పిల్లలు స్కూల్ నుండి వస్తారు. వారిని ఫ్రెష్ అప్ చేయించి వారితో హోమ్ వర్క్

చేయిస్తుంది. ఆ తరువాత రాత్రి వంట. అందరికీ భోజనాలు వడ్డించడం, ఉదయానికి కూరగాయలు సిద్ధం చేసుకోవడం ఇలా ఏదో ఒకటి పడుకునేంత వరకు యంత్రంలా కదుల్తూనే వుంటుంది. కాని, సురేష్ అలా కాదు. అతను భార్య ఇచ్చిన టీ త్రాగేసి పొద్దున చదవగా మిగిలిపోయిన పేపర్ తిరగేస్తాడు.

ఆ తరువాత ట్రిమ్‌గా తయారయి, చౌరస్తాకనో, ఫ్రెండ్స్‌తో బాతాఖానీకో బయలు దేరతాడు. అతను సరదాగా బయట తిరిగొచ్చి రాత్రి పడుకునేదాకా సీత ఇంటి పనితో, అత్తామామల సేవతో, పిల్లల హోమ్‌వర్క్ చేయించడంలో వారి మధ్యన గిల్లికజ్జాలను తీరుస్తూ సతమతమవుతూనే వుంటుంది. బస్ రావడంతో ఆలోచనలు మాని ఎక్కింది సీత. బస్ ఫుల్ రష్‌గా వుంది. నిత్యం అలవాటయిన తోపులాడే అయినా నిలువెల్లా అనీజీ. ఆ తోపులాట వంకతో అటూ ఇటూ కావాలని రాసుకుంటూ తిరిగే మగాళ్ళు. చిరాకేసింది సీతకి. కాని ఏం చేయగలదు. నిస్సహాయత.

"ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర ఆగింది బస్. సీతలో కంగారు. ఆలస్యమయితే బాస్‌తో చీవాట్లు పడటమేమోగానీ ఆ వంకతో పిలిచి అతను చేసే వెకిలి చేష్టలే కష్టమని పిస్తాయి సీతకి. సిగ్నల్ వదిలింది. బస్ కదిలింది. కాని, సీత భయపడ్డట్టుగానే ఆలస్యం జరిగింది.

తను ఆఫీసులోకి వెళ్ళేసరికి ఉద్యోగులు సంతకం చేసే రిజిష్టరు బాస్ గదిలోకి వెళ్ళిపోయింది. ప్రాణం పోయినట్టయింది సీతకి. భయం భయంగా బాస్ గదిలోకి వెళ్ళి ఆలస్యానికి సంజాయిషీ ఇచ్చుకుని, ఆయన వెర్రి మొర్రి చేష్టలు ఓపికతో భరించి, తరువాత "బ్రతుకు జీవుడా" అనుకుంటూ వచ్చి తన సీట్లో కూచుంది సీత.

ఆమెలో చెప్పలేనంత అలసట. ఇంకా తను చెయ్యాల్సిన ఆఫీసు పని మొదలే కాలేదు. అయినా ఆమెలో అలసట. కాని చేయక తప్పదు. టేబుల్‌పై వున్న ఫైల్స్ చేతిలోకి తీసుకుంది.

ఫైల్‌మీద ఆమె మనసు ఏ మాత్రం లగ్నం కావడం లేదు. మనసు నిండా ఆలోచనలు, అలజడి, మానసిక సంఘర్షణ. అందరున్నా తను ఒంటరి, తనను అర్థం చేసుకునే వారు కాని, తనకు సహాయం చేసే వారు కాని ఎవరూ లేరు. రోజుకు ఇరవై గంటలు యంత్రంలా పనిచేసినా కూడా భర్త నుంచి తను ఆశించిన ప్రేమ గానీ, ఓదార్పు కాని లభించవు. మరి ఎందుకోసం ఇంత శ్రమించడం?

బాధగా కణతలు నొక్కుతుంది సీత.

నిజమే, స్త్రీ చాలా ఎదిగింది. చాలా చాలా అభివృద్ధి చెందింది. స్త్రీ విద్య అనర్థ దాయకం అనే అజ్ఞానం నుంచి బయటికొచ్చి విజ్ఞాన సముపార్జన చేస్తోంది. నాలుగు గోడల మధ్య జరిగిన ఎన్నో ఏళ్ళ అణచివేత తరువాత స్త్రీ బయట అడుగు పెట్టి ఉద్యోగాలే కాదు. అన్ని రంగాలలో కూడా ముందుకు దూసుకెళ్తోంది. కాని, దీని వల్ల స్త్రీకి ఎంత మేలు జరుగుతోంది. మేలుకంటే కీడే ఎక్కువ జరుగుతోందేమో.

తనతో సమానంగా సంపాదించే భార్యను తనకంటే ఎక్కువ శ్రమించే భార్యను ఎంత మంది భర్తలు అర్థం చేసుకుంటున్నారు. పూర్వకాలంలో అయితే స్త్రీకి కేవలం వంట పని, ఇంటి బాధ్యతలు మాత్రమే వుండేవి. కాని, ఈనాడు వాటికి తోడు ఉద్యోగి బాధ్యతలు. అయినా స్త్రీ సామాజిక, ఆర్థిక పరిస్థితిలో ఏమయినా మార్పు వచ్చిందా.

ఆనాడు స్త్రీ ఉన్నతికోసం పోరాడిన వీరేశలింగం, రాజారామ్‌మోహన్‌రాయ్ లాంటి మహానుభావులు ఈనాడు ఉండి వుంటే తాము పొరపాటు చేశామని అనుకునే వారేమో.

"మేడమ్ మిమ్మల్ని బాస్ రమ్మంటున్నాడు" ప్యూన్ పిలుపుతో ఉలిక్కిపడి ఈ లోకానికి వచ్చింది సీత. ఆలోచనలు మాని బాస్ రూమ్ వైపు కదిలింది.

బాస్ మొహం కోపం, అసహనం, విసుగు మొదలయిన భావాలతో జేవురించి నట్టుగా ఉంది.

ఆయన మొహం చూడడంతోనే సీత "ఈ రోజు నాకు ఏదో మూడినట్టే వుంది" అనుకుంది.

ఆమె ఊహించినట్టే బాస్ ఆమెను చూడగానే అంతెత్తున లేచాడు.

"చేసే పని మీద సిన్సియారిటీ లేంది

ఎందుకమ్మా మీలాంటోళ్ళు ఉద్యోగాలు చేయడం" విసురుగా అన్నాడు అతను.

మరీ అంత హార్డ్‌గా అంటాడని వూహించని సీత ఆ మాటలకి బాగా హర్ట్ అయింది.

''ఏమయింది సార్'' అంది ఫీలింగ్స్ కనపడకుండా జాగ్రత్త పడుతూ.

"ఏమయిందా, నీ మీద నమ్మకంతో నీవు మొన్న కంప్లీట్ చేసిన ఫైల్ చెక్ చేయకుండా సంతకాలు చేసి హెడ్ ఆఫీసుకి పంపాను. అందులో అన్నీ పొరపాట్లే ఉన్నాయంటూ ఫోన్ చేసి మరీ చీవాట్లు వేశారు నన్ను"మండి పడుతూ అన్నాడు బాస్.

సీత అవమానభారంతో తలదించుకుని నిలుచుంది.

"పని చేయడం ఇష్టం లేకపోతే రిజైన్ చేసి ఇంట్లో కూచోండి. అంతేకాని ఆఫీసుకి వచ్చి మాలాంటి సిన్సియర్ ఆఫీసర్ల ప్రాణాలు తీయకండి" అన్నాడు నిష్ఠురగా.

అతను మామూలుగా ఉన్నప్పుడు లేడీ ఎంప్లాయీస్‌ని ట్రాప్ చేసే ఉద్దేశంతో ఎంత చొంగకార్చుకుంటూ నెమ్మదిగా మాట్లాడినా, కోపమొస్తే మాత్రం ఆపుకోలేడు. పైగా అతనికిప్పుడు పైనుంచి చీవాట్లు పడ్డాయి. అందుకే అతనికోపం నషాలాని కంటింది.

సీతకి మాత్రం అతని మాటలకు కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"కనీసం ఫైల్‌ను కూడా చెక్ చేయకుండా సంతకం చేసి హెడ్ ఆఫీస్‌కి పంపడమా సిన్సియారిటీ అంటే" అనాలనుకుంది. కాని అనలేదు.

"ఇంకా నిలుచున్నావేం వెళ్ళు. ఇంకాసేపట్లో హెడ్ ఆఫీసు నుంచి ఆ ఫైల్ వస్తుంది. అది సరిచేసుకుని తీసుకురా. ఇదిగో ఈ ఫైల్ కూడా కంప్లీట్ చేసి తీసుకురా. ఇక నువ్వు వెళ్ళొచ్చు" ఏకవచన సంబోధన చేస్తూ చికాగ్గా అన్నాడు.

దుఃఖం పొంగుకొచ్చింది సీతకి. ఉబికి వచ్చే కన్నీళ్ళని ఆపుకుంటూ తన సీట్లోకి వెళ్ళింది. అసహాయతతో చేతిలోని ఫైల్ టేబుల్ పైకి విసురుగా గిరాటేసి నిశ్శబ్దంగా ఏడుస్తూ కూచుండిపోయింది.

స్టాఫంతా ఓ క్షణం ఆమెను జాలిగా చూసినా, అందరూ అలాంటి బాధితులే. కాబట్టి వెంటనే తిరిగి తమ పనిలో నిమగ్నమయ్యారు.

* * * *

తండ్రికి ఆరోగ్యం బాగా లేదనగానే రెండు రోజులు సెలవు పెట్టి పుట్టింటికి వెళ్ళింది సీత. కూతురుని చూడగానే అనసూయమ్మకి దుఃఖం ఆగలేదు. కూతుర్ని పట్టుకుని వలవలా ఏడ్చింది. చిన్నదయినా తల్లికి ధైర్యం చెప్పి అసలు విషయమేంటని అడిగింది సీత.

"డాక్టర్లు తండ్రికి హార్ట్ సర్జరీ చేయాలన్నారని" చెప్పింది అనసూయమ్మ.

తల్లి చెప్పింది విని అవాక్కయింది సీత. ఎప్పుడూ ఆరోగ్యంగా నవ్వుతూ తిరుగాడే తండ్రికి గుండె జబ్బంటే ఆమెకు నమ్మకం కలగలేదు.

అనసూయమ్మ చెపుతోంది. ''డాక్టర్లు అపరేషన్‌కి పెద్ద మొత్తమే అవుతుందన్నారు. ఇంట్లో వున్న కాస్త బంగారం, ఉన్న కొద్దిపాటి స్థలం అమ్మాను. అయినా ఆపరేషన్‌కి యాభైవేలు తక్కువ అయ్యాయి. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఎక్కడా అప్పు పుట్టేట్టు కూడా లేదు'' జలజలా కన్నీరు కారుతుండగా అంది.

తల్లి మాటలకు మ్రాన్పడిపోయింది.

* * * *

"అయితే ఏమంటావు" కోపంగా అన్నాడు సురేష్.

"అది కాదండీ. మా నాన్న ఆపరేషన్‌కయ్యే ఆ యాభైవేలు మనం సర్దితే ఆ తరువాత నాన్న ఆరోగ్యం కుదుట పడ్డాక నెమ్మదిగా అడిగి తీసుకుందాము". అప్పుగా ఇద్దామంటేనన్నా భర్త ఒప్పుకుంటాడన్న ఉద్దేశంతో సాధ్యమయినంత

**జీవితం?!**

**జీ**వితం
అర్థం కాకపోతే
ప్రశ్నార్థకం
అర్థమయితే
ఆశ్చర్యార్థకం!

**–తాజీ ప్రసాద్**

కన్విన్సింగ్‌గా అంది సీత.

"ఓహో అలాగా. మరి ఆపరేషన్ మధ్యలోనే టపా కట్టేస్తే" వ్యంగ్యంగా అన్నాడు. ఆ మాటలకి ఆమె చివాల్న తలెత్తి భర్తను తీక్షణంగా చూసింది.

భార్య మొహంలో ఎప్పుడూ అంత కోపం చూడని సురేష్ ఆమె అంత తీక్షణంగా తనను చూసే సరికి కొంచెం వెనక్కి తగ్గాడు.

"ఏది ఏమయినా నేను డబ్బు ఇవ్వడానికి ఒప్పుకోను" అన్నాడు నెమ్మదిగా.

సీత మాట్లాడలేదు. సురేష్ గదిలో నుంచి బయటకు వెళ్లాడు. తల్లిదండ్రులతో చెప్పాడో ఏమో అత్తా మామల సణుగుల కూడా వినిపిస్తున్నాయి. ఇది మరీ బాధించింది సీతని.

"అసలు ఎందుకీ మనుషులు ఇంత దారుణంగా, సంకుచితంగా ఆలోచిస్తారు. మనిషి ప్రాణాలకంటే కూడా డబ్బే ముఖ్యమా వీరికి. పెళ్ళయిన పదేళ్ళ నుంచి తన సంపాదన వీరు కదూ దోచుకుంటోంది. అసలు నేను డబ్బు సంపాదించి వీరికి ఇవ్వటానికి కారణం నా తల్లిదండ్రులు కాదూ. మరి వారి కోసం కాస్త కూడా డబ్బు ఖర్చు పెట్టే స్వేచ్ఛ నాకు లేదంటారేమిటి. అడిగితే అనుమతి ఇవ్వనంటారేమిటి.
నన్ను కని, పెంచి, చదివించి, ఉద్యోగం చేసే స్థాయికి తీసుకొచ్చింది నా తల్లిదండ్రులే కదా. మరి అలాంటప్పుడు నా సంపాదన మీద హక్కు తల్లిదండ్రుకుల కుండాలి కాని, వీరి కెందుకుండాలి.

పుట్టింటి వారికి ప్రాణాల మీదికి వచ్చినా పట్టించుకోకుండా, అత్తింటి వారికి అణిగి మణిగి ఉండడం పైనే స్త్రీ సంసారం, ఆమె జీవితపు మనుగడ ఆధారపడి ఉన్నప్పుడు ఇక స్త్రీ చదువుకోవడమెందుకు ఉద్యోగాలు చేయడమెందుకు.

అసలు ఎక్కడి ఉంది స్త్రీకి ఆర్థిక స్వేచ్ఛ.

తల పగిలి పోతూంది సీతకి.

"అమ్మా ఈ ప్రాబ్లమ్ ఎలా చేయాలో చెప్పమ్మా" అంటూ కూతురు వచ్చింది మాథ్స్ నోట్స్ తీసుకుని.

కూతురు అడిగిన ప్రాబ్లమ్ ఎలా చేయాలో చెప్పి పంపించింది. ఆ తరువాత పనులు కూడా మౌనంగానే చేసింది సీత.

రాత్రి పదవుతుందనగా మొహం వేలాడేసుకుని వచ్చాడు సురేష్. అతని మొహం చూడగానే సీతకి అర్థమయిపోయింది అతను సరదాగా స్నేహితులతో ఆడే పేకాటలో డబ్బు పోగొట్టుకున్నాడని.

మౌనంగా అన్నం వడ్డించింది. సురేష్ కూడా ఏం మాట్లాడలేదు.

"మాట్లాడితే ఎక్కడ యాభైవేలు తన వాళ్ళకు పంపించమంటుందో అనుకుని మాట్లాడకుంటేనే నయం" అనుకున్నాడు మనసులో.

అతను భోజనం ముగించాక సీత ఒక పేపర్ తీసుకొచ్చి అతని చేతిలో పెట్టింది.

"ఏమిటిది" ఆశ్చర్యంగా అన్నాడు సురేష్.

"నా రిజిగ్నేషన్ లెటర్" చెప్పింది.

"ఏంటి" నోరు తెరిచి అన్నాడు సురేష్.

"అవును నేను ఉద్యోగం చేయదల్చుకోలేదు. స్త్రీలు ఉద్యోగం చేసేది తమ ఆర్థిక స్వేచ్ఛ కోసం. భర్త సరదాలకీ, సంతోషాలకీ మాత్రమే స్త్రీలు ఉద్యోగం చేయాలి అని మీరనుకుంటే అది పొరపాటు. నా తండ్రి వైద్యానికి కాస్త డబ్బు సహాయం చేసే ఆర్థిక స్వేచ్ఛ కూడా లేనప్పుడు ఈ చదువూ, ఈ జ్ఞానము ఈ ఉద్యోగం అన్నీ నాకు వ్యర్థమే అనిపిస్తున్నాయి. అందుకే ఉద్యోగం మానేయాలనుకుంటున్నాను. మీరు రేపు ఆఫీసుకి వెళ్ళేప్పుడు ఈ లెటర్ మా ఆఫీసులో ఇచ్చి వెళ్ళండి" అని భర్తకు మరో మాట మాట్లాడే అవకాశం ఇవ్వకుండా అక్కడి నుంచి కదిలింది సీత.

సీత నిర్ణయానికి నోట మాట రాకుండా స్థాణువయిపోయాడు సురేష్.

"ఇప్పుడు యాభైవేలు వదులుకుంటే ఎక్కువ నష్టమా, లేక సీత ఉద్యోగం మానేస్తే జరిగేది ఎక్కువ నష్టమా" అనే అంతర్మథనం అతనిలో అప్పుడే మొదలయింది.

చివరికతను యాభై వేల నష్టానికే మొగ్గు చూపాడు.

■